
సాక్షి
కాకినాడ

మంగళవారం। 10। అక్టోబర్। 2023



రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో సుదర్శన హోమానికి పెన్మెత్స విశ్వనాథరాజు (పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర) సోమవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 4.700, మధ్య డెల్టాకు 2.300, పశ్చిమ డెల్టాకు 7 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు.

ప్రాణాలు తీసిన అతి వేగం



అతి వేగం ఇద్దరి ప్రాణాలను బలి తీసుకుంది. రెండు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. తల్లిదండ్రులకు పుత్రశోకాన్ని మిగిల్చింది. కాకినాడ నగరంలోని నాగమల్లితోట జంక్షన్ వద్ద వేగంగా వస్తున్న స్కూటర్ డివైడర్‌ను ఢీకొని స్నేహితులైన ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు.

- 8లో▸

న్యూస్‌రీల్

12న సామర్లకోటకు సీఎం జగన్



సామర్లకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 12వ తేదీన సామర్లకోట వస్తున్నట్లు ముఖ్యమంత్రి అదనపు పర్సనల్ సెక్రటరీ కె.నాగేశ్వరరెడ్డి నుంచి ఉత్తర్వులు వచ్చాయి. జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఇప్పటికే మూడు పర్యాయాలు అనివార్య కారణాల వల్ల ముఖ్యమంత్రి పర్యటన వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ నెల 12న సీఎం జగన్ తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి, సామర్లకోట – పెద్దాపురం రోడ్డులోని ప్రైవేటు లే అవుట్‌లో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ప్రత్తిపాడు రోడ్డులోని జగనన్న లే అవుట్‌కు చేరుతారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించిన ఐదు లక్షల ఇళ్లను ఈటీసీ లే అవుట్‌లోని జగనన్న కాలనీలో సామూహిక గృహ ప్రవేశాల ద్వారా ప్రారంభిస్తారు. అనంతరం అక్కడ వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అక్కడి నుంచి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ ప్రదేశానికి చేరుకొని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ నుంచి రోడ్డు మార్గంలో పెద్దాపురం రోడ్డులోని హెలిపాడ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో తాడేపల్లి వెళతారు.

ఆర్టీసీని లాభాల బాటలో నడపాలి

ఈడీ గోపినాథ్ రెడ్డి



సిబ్బందికి అవార్డులను అందజేస్తున్న ఈడీ గోపినాథ్ రెడ్డి

తుని: ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించి ఆర్టీసీని లాభాల బాటలో నడపాలని ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.గోపినాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం తుని డిపోను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నెల 15 వరకు జరగనున్న టైరు సంరక్షణ పక్షోత్సవాలను పురస్కరించుకొని కార్మికులకు పలు సూచనలు చేశారు. గత నెలలో అత్యధిక ఆదాయం సమకూర్చిన కండక్టర్ ఎస్‌కె.బాజి, డ్రైవర్ ఎంఎస్.రాజులకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బలోపేతానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. జిల్లా ప్రజా రవాణా అధికారి మేడిశెట్టి శ్రీనివాసరావు, తుని డిపో మేనేజరు ఎస్.కిరణ్‌కుమార్, సూపర్ వైజర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బండారు బహిరంగ క్షమాపణ చెప్పాలి



వర్ధినీడి సుజాత

పిఠాపురం: మహిళలను కించ పరిచే ముందు మీ ఇంట్లోనూ మహిళలు ఉన్నారన్న సంగతి మర్చిపోకూడదని మాజీ మంత్రి బండారు సత్యనారాయణకు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత హితవు పలికారు. మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆమె ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లేకుంటే మహిళలు బయట తిరగనివ్వరని హెచ్చరించారు. నీచ రాజకీయాలు చేయడం మహిళలను కించపర్చడం టీడీపీకి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. టీడీపీ పాలనలో మహిళా తహసీల్దారును జుత్తు పట్టుకుని ఈడ్చిన సంగతి ప్రజలందరికీ తెలుసునన్నారు. అందుకే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఎస్సీ కులంలో ఎవరైనా పుట్టాలనుకుంటారా అంటూ దిగజారి వ్యాఖ్యానించారని ఇప్పుడు నువ్వూ అదే బాటలో పయనిస్తున్నట్టు ప్రజలందరికీ అర్థమయ్యిందన్నారు.

రత్నగిరి టోల్‌గేట్ వేలం పాట ఏడాదికి రూ.1.83 కోట్లు

అన్నవరం: సత్యనారాయణ స్వామివారి దేవస్థానం టోల్‌గేట్ వద్ద రెండేళ్ల కాలపరిమితిలో వాహనాల నుంచి టోల్ రుసుం వసూలుకు సోమవారం నిర్వహించిన టెండర్ కం బహిరంగ వేలంలో నెలకు రూ.15.25 లక్షలకు వేలంఖరారైంది. ఏడాదికి రూ.1.83 కోట్లు. జూలైలో వేలం నిర్వహించగా నెలకు రూ 2.80 కోట్లకు వేలం పాట జరిగింది. మూడు నెలల గడువులో పాటదారుడు పాట సొమ్ము చెల్లించలేదు. దీంతో సోమవారం రెండో విడత వేలం నిర్వహించారు. 2021లో వేలం పాట రూ.12.10 లక్షలు మాత్రమే, జూలైలో జరిగిన వేలంతో పోల్చితే ఏడాదికి రూ.97 లక్షలు తక్కువ. దేవస్థానం ధర్మకర్తల మండలిలో దీనిపై చర్చించి ఈఓ చంద్రశేఖర్ వేలం పాట ఖరారుపై నిర్ణయం తీసుకుంటారని సమాచారం.

పండగ బస్సుకు.. రైట్ రైట్..



- ఆర్టీసీలో దసరా ధమాకా
- ప్రయాణికులకు స్పెషల్ ఆఫర్లు
- రానూపోనూ బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ
- హైదరాబాద్‌కు అత్యధిక డిమాండ్
- ఉమ్మడి 'తూర్పు' నుంచి 110 స్పెషల్ బస్సులు
- అన్నింటా యథాతథంగా చార్జీలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: దసరా పండగలు దగ్గర పడుతున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అంతటా పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలకు పందిరి రాటలు వేస్తున్నారు. మరో నాలుగైదు రోజుల్లో ఈ ఉత్సవాలు మొదలు కానున్నాయి. ఈ పండగల వేళ ప్రయాణికుల రద్దీని 'సొమ్ము' చేసుకునేందుకు ప్రైవేటు ట్రావెల్స్ సిద్ధమవుతున్నాయి. ప్రయాణికుల ముక్కు పిండి మరీ అధిక చార్జీలు వసూలు చేసి, నాలుగు డబ్బులు వెనకేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి.

ప్రజాసేవే పరమావధిగా..

ప్రైవేటు ట్రావెల్స్‌కు భిన్నంగా లాభనష్టాలతో ప్రమేయం లేకుండా.. ప్రయాణికుల సేవే పరమావధిగా ఏపీఎస్ ఆర్టీసీ అడుగులు వేస్తోంది. దసరా, దీపావళి, సంక్రాంతి సహా ఇతర పండగలు, ఉత్సవాలప్పుడు ప్రయాణికుల సౌకర్యార్థం డిమాండును బట్టి లాభాపేక్ష లేకుండా ప్రత్యేక బస్సులు నడుపుతోంది. వరుస సెలవులు వచ్చే పండగల్లో దసరాకు తొలి ప్రాధాన్యం ఉంటుంది. ఈ పండగ వేళ దూర ప్రాంతాలకు ప్రయాణించే వారిపై గతంలో మాదిరిగానే అదనపు చార్జీల భారం మోపకుండా సాధారణ చార్జీలతో ఆర్టీసీ బస్సులు నడవనుంది. **అలాగే రానూపోనూ ప్రయాణానికి ఒకేసారి టిక్కెట్లు బుక్ చేసుకుంటే చార్జీల్లో 10 శాతం రాయితీ కూడా ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దసరా స్పెషల్ బస్సులు** నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు డిపోల నుంచి ప్రయాణికుల సౌకర్యార్థం మొత్తం 110 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాలకు ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్‌లగ్జరీ, ఇంద్ర నాన్‌స్టాప్ బస్సులు నడపనున్నారు.

ప్రైవేటు బాదుడుకు తాళలేక..

మరోవైపు ప్రైవేటు ట్రావెల్స్ బాదుడు తట్టుకోలేక ప్రయాణికులు అత్యధికంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికే మొగ్గు చూపుతున్నారు. పండగ కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు ఇప్పటికే ఆర్టీసీలో టిక్కెట్లు బుక్ చేసుకుంటున్నారు. దసరా, సంక్రాంతి పండగలంటే గోదావరి జిల్లాల వాసులు ఎంత దూరాన ఉన్నా కచ్చితంగా రెక్కలు కట్టుకుని స్వస్థలాల్లో వాలిపోతారు. అందునా గోదావరి ఆడపడుచులైతే ఎన్ని పనులున్నా పక్కన పెట్టి మరీ ఇక్కడకు వస్తూంటారు. దీంతో దసరాకు వారం రోజుల ముందు నుంచే బస్సులు కిక్కిరిసిపోతూంటాయి. ప్రయాణం సురక్షితం, సుఖవంతం అనే నమ్మకంతో ఎక్కువ మంది ఆర్టీసీ బస్సులకే ప్రాధాన్యం ఇస్తూంటారు. గత చంద్రబాబు పాలనలో పండగల వేళ ప్రత్యేక బస్సుల పేరుతో ప్రయాణికులపై 30 నుంచి 50 శాతం అదనపు చార్జీల భారం మోపేవారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తరువాత నుంచి ఇందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. ప్రయాణికులపై పైసా అదనపు భారం వేయకుండా ప్రభుత్వం ప్రత్యేక బస్సులను సైతం సాధారణ చార్జీలతోనే నడుపుతోంది.



పండగ వేళ రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రద్దీ (ఫైల్)

పది రోజులు సెలవులు రావడంతో..

కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన వేలాది మంది విద్య, ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో ఉంటున్నారు. ప్రధానంగా ఎక్కువ మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా ఈ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. దసరా పండగకు 10 రోజులు పైనే సెలవులు రావడంతో దూరప్రాంతాల్లో ఉంటున్న వారు కుటుంబ సమేతంగా బయలుదేరుతున్నారు. రైళ్లలో అయితే దాదాపు రెండు నెలల ముందే బెర్తులు రిజర్వు చేసుకున్నారు. ఆర్టీసీ బస్సుల్లో కూడా స్వస్థలాలకు వచ్చేందుకు ముందస్తు రిజర్వేషన్లు చేయించుకుంటున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే కోటా సీట్లకు సిఫారసు లేఖలతో ఆర్టీసీలో సీట్లు రిజర్వు చేయించుకుంటున్నారు.

- **కాకినాడ జిల్లాలో** కాకినాడ, తుని, ఏలేశ్వరం **ఆర్టీసీ** బస్సు డిపోలు ఉన్నాయి. ఈ **డిపోల ద్వారా** ఈ నెల 18 నుంచి 23వ తేదీ **వరకూ దూర** ప్రాంతాల నుంచి జిల్లాకు **పండగ** స్పెషల్ బస్సులు నడిపేందుకు **ఏర్పాట్లు చేశారు**. తిరుగు ప్రయాణంలో ఈ **నెల 25 నుంచి** 28వ తేదీ వరకూ కూడా **ప్రత్యేక బస్సులు** నడపనున్నారు. హైదరా**బాద్‌కు ఏలేశ్వరం** డిపో నుంచి 5, తుని **నుంచి 6, కాకినాడ** నుంచి 24 బస్సులు **కలిపి మొత్తం 35** ప్రత్యేక బస్సులను ఆర్టీసీ **అధికారులు సిద్ధం** చేశారు. వీటితో పాటు **విజయవాడ,** విశాఖ నగరాలకు కూడా **రోజూ రెండు** అదనపు సర్వీసులు నడపనున్నారు.
- **డాక్టర్ బీఆర్** అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో **అమలాపురం,** రామచంద్రపురం, రావుల**పాలెం, రాజోలు** ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. **వీటి పరిధిలో** మొత్తం 50 బస్సులను **దసరా ప్రయాణా**లకు సిద్ధం చేశారు. హైదరాబాద్ నుంచి అమలాపురానికి 25, రాజోలుకు 10, రావులపాలేనికి 10, రామచంద్రపురానికి 5 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. విశాఖపట్నం, విజయవాడ, ఇచ్ఛాపురం, సాలూరుకు కూడా రద్దీని బట్టి ప్రత్యేక సర్వీసులు అప్పటికప్పుడు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.
- తూర్పు గోదావరి జిల్లా నుంచి హైదరాబాద్‌కు 25 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఇందులో రాజమహేంద్రవరం నుంచి 15, గోకవరం డిపో నుంచి 4, కొవ్వూరు నుంచి 4, నిడదవోలు డిపో నుంచి 2 చొప్పున ప్రత్యేక బస్సులు సిద్ధం చేస్తున్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి విజయవాడ, విశాఖ నగరాలకు కూడా అప్పటికప్పుడు ప్రత్యేక బస్సులు నడుపుతామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

సాధారణ చార్జీలతోనే స్పెషల్ బస్సులు



ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దసరా పండగకు ప్రత్యేక బస్సులు సిద్ధం చేస్తున్నాం. గత ఏడాది మాదిరిగానే ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని స్పెషల్ బస్సులను సాధారణ చార్జీలతోనే నిర్వహించనున్నాం. దూర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చేవారిని తీసుకు రావడానికి ఆయా డిపోల నుంచి బస్సులను ఖాళీగా పంపించాల్సి ఉంటుంది. ఇది ఆర్థికంగా భారమే అయినప్పటికీ ప్రయాణికుల కోసం ప్రభుత్వమే భరిస్తోంది. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందీ కలగని రీతిలో ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే ప్రయాణికులు టిక్కెట్లు బుక్ చేసుకుంటున్నారు.

– ఎం.శ్రీనివాసరావు, జిల్లా ప్రజా రవాణా అధికారి, కాకినాడ

ముగిసిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు



విజేతలకు మెడల్స్ అందజేస్తున్న ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా తైక్వాండో సంఘం ఆధ్వర్యంలో జిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. పోటీల ముగింపునకు ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలలో జిల్లా వ్యాప్తంగా 400 మంది పాల్గొన్నారు. క్యాడెట్, జూనియర్స్, సబ్-జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో 82 మంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు తెలిపారు. ఈ సందర్భంగా వీరభద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలలో రాణించి జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు. ఒలింపిక్ సంఘ ప్యాట్రన్ కర్రిభామిరెడ్డి,ఒలింపిక్ సంఘ చైర్మన్ చంద్రు గోవిందరాజు, పీఆర్ కళాశాల రిటైర్డ్ పీడీ కృష్ణమూర్తి, తైక్వాండో సంఘ ప్రతినిధులు సత్యనారాయణ, అఖిల, త్రిమూర్తులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి స్పందనకు 504 అర్జీలు

కాకినాడ సిటీ: జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారాలు లభించేలా చూడాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం స్పందన సమావేశ మందిరంలో జరిగిన జిల్లా స్థాయి జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, సివిల్ సప్లయ్ డీఎం డి.పుష్పమణి, కేఎస్ఈజెడ్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె.మనోరమలతో కలిసి ఆమె హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను సావధానంగా విని, అర్జీలను సత్వరం పరిష్కరించాల్సిందిగా ఆయా శాఖల అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి 504 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ప్రజల సమస్యల్ని సత్వరమే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం ఇవ్వాలన్నారు. ఒకే అంశంపై మళ్లీ మళ్లీ అర్జీలు నమోదు కాకుండా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

ముఖ్యమంత్రి పర్యటనపై సమీక్ష

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామర్లకోట పర్యటన ఈనెల 12న ఖరారైన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. సామర్లకోట ఈటీసీ జగనన్న కాలనీలో గృహ నిర్మాణ పనులు, హెలిప్యాడ్, పైలాన్, పార్క్, బస్సు, ఆటోలు పార్కింగ్, రోడ్‌షో, స్టాల్స్, ఫోటో ప్రదర్శన స్పందన వలంటీర్‌ల ద్వారా అర్జీల స్వీకరణ, లబ్ధిదారుల తరలింపు వంటి అంశాలకు సంబంధించి ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈమేరకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.

కృష్ణారెడ్డికి జీవిత సాఫల్య పురస్కారం

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): మరో మూడు నెలల్లో సినిమా చేస్తానని సినీ దర్శకుడు, నటుడు ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు. మళ్లీ సినిమాలు ఆపకుండా తీస్తామని పేర్కొన్నారు. జిల్లా కేంద్రం కాకినాడలో సోమవారం ఎస్వీ కృష్ణారెడ్డికి కాకినాడ మ్యూజికల్ గ్రూపు ఆధ్వర్యంలో జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. కాకినాడ అంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. మా అమ్మాయికి ఇక్కడ ఉందన్నారు. దేవుడు కరుణ, ప్రేక్షకుల దయతోను ఎంతో ఆనందంగా ఉన్నట్లు చెప్పారు. తాను ఎప్పుడూ జీవిత సాఫల్య పురస్కారం అందుకోలేదన్నారు. తొలిసారి ఈ పురస్కారం అందుకొంటున్నట్లు చెప్పారు. ఈ పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. మానవతా విలువలు పరిమళించే గుబాళింపుగా సినీ సంగీతం సాగాలన్నారు. ఈ సందర్భంగా సినీ రంగ అనుభవాలు పంచుకొన్నారు. అనంతరం



ఎస్వీ కృష్ణారెడ్డికి జీవిత సాఫల్య పురస్కారం అందిస్తున్న కాకినాడ మ్యూజికల్ గ్రూపు సభ్యులు

ఎస్వీ కృష్ణారెడ్డికి జీవిత సాఫల్య పురస్కారం అందించారు. కార్యక్రమంలో కాకినాడ మ్యూజికల్ గ్రూపు వ్యవస్థాపకులు జీఎస్‌జెకుమార్, సెక్రటరీ టి రవికుమార్, ప్రముఖ సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి, సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

రత్నగిరి.. విద్యుత్ కాంతుల సిరి

- రూ.70 లక్షలతో అండర్ గ్రౌండ్ కేబుల్
- కొత్తగా విద్యుత్ దీపాలు
- పంపా ఘాట్ వద్ద హైమాస్ట్ వెలుగులు

అన్నవరం: రత్నగిరి శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం విద్యుద్దీప కాంతులతో ప్రకాశిస్తోంది. గతంలో అక్కడో దీపం,..ఇక్కడో దీపం అన్న చందంగా ఉండేది. అలాంటిది ఇప్పుడు దేవస్థానం ఘాట్‌రోడ్లు దేదీప్యమానంగా వెలుగులు విరజిమ్ముతున్నాయి. రూ.70 లక్షల వ్యయంతో దేవస్థానంలో అండర్‌గ్రౌండ్ కేబుల్‌తో బాటు 70 స్తంభాలను ఏర్పాటు చేశారు. గతంలో స్తంభాలు లేక చెట్లకు విద్యుత్ దీపాలు కట్టి వెలిగించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. దేవస్థానం ఈఓగా చంద్రశేఖర్ ఈఓగా బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్లలోనే చాలా చోట్ల విద్యుత్ దీపాలు లేని విషయం గుర్తించారు. ప్రధానంగా సత్రాలు, ఘాట్‌రోడ్లలో అక్కడక్కడ మాత్రమే దీపాలు వెలిగేవి. ఆయన వెంటనే అన్ని సత్రాలు, ఘాట్‌రోడ్లు, పార్కింగ్ స్థలాలు, స్వామివారి రాజగోపురాల ముందు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముఖ్యమైన కూడళ్లలో హైమాస్ట్ లైట్ల వేయాలని దేవస్థాన విద్యుత్ డీఈ సూర్యనారాయణకు ఆదేశాలిచ్చారు. దేవస్థానంలో ఇప్పటి వరకు 50 విద్యుత్ స్తంభాలు మాత్రమే ఉండేవి. కొత్తగా 70 ఏర్పాటు చేసి ఫిలిప్స్ వైట్ దీపాలు ఏర్పాటు చేశారు. దీంతో దేవస్థానం దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది. మిగిలిన చోట్ల కూడా విద్యుద్దీపాల ఏర్పాటుకు చురుగ్గా పనులు జరుగుతున్నాయి.

ఘాట్ల వద్ద హైమాస్ట్ లైట్స్



చంద్రశేఖర్ అజాద్, దేవస్థానం ఈఓ

దేవస్థానానికి వచ్చే భక్తులలో చాలా మంది పంపా ఘాట్‌లలో స్నానాలు ఆచరించాక స్వామివారిని దర్శించుకోవడం సంప్రదాయం. సెప్టెంబర్ నుంచి భవాని దీక్ష, అక్టోబర్, నవంబరులో సత్యదీక్ష, స్వామి అయ్యప్ప మాల వేసుకునే భక్తులు ఈ ఘాట్ల వద్ద స్నానాలు చేస్తుంటారు. దసరా, కార్తిక మాసంలో రోజూ వేలాది మంది భక్తులు స్నానాలకు వస్తుంటారు. ఇప్పటివరకు రెండు ఘాట్లలో రెండు విద్యుద్దీపాలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు మూడు హైమాస్ట్ దీపాలను ఏర్పాటు చేశారు. ఈ దీపాల వెలుగుతో పంపా ఘాట్‌లన్నీ కాంతివంతగా దర్శనమిస్తున్నాయి.

అన్ని చోట్ల ఏర్పాటు



దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు మారు మూల కూడా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి దీపాలు వెలిగించాం. తూర్పు, పశ్చిమ రాజగోపురాలకు బంగారు రంగు దీపాలను ఏర్పాటు చేశాం. ఘాట్ రోడ్లు, సత్రాలు, కూడళ్లలో దీపాలు ఏర్పాటు చేశాం. గతంలో వనదుర్గ ఆలయ మార్గంలో దీపాలు ఉండేవి కావు. ఇప్పుడు ఏర్పాటు చేశాం. నాణ్యతతో రాజీ పడకుండా పేరున్న కంపెనీకి చెందిన తెలుపు దీపాలను ఏర్పాటు చేశాం. మరి కొన్ని చోట్ల పనులు జరుగుతున్నాయి. కార్తికమాసం నాటికి అన్ని పనులు పూర్తవుతాయి.

– టీ సూర్యనారాయణ, విద్యుత్ డీఈ,



బంగారు వర్ణంతో ప్రకాశిస్తున్న సత్యదేవుని పశ్చిమ రాజగోపురం



పంపా ఘాట్ వద్ద హైమాస్ట్ దీపాలు



విద్యుత్ దీపాల వెలుగులో నడిచి వస్తున్న భక్తులు

ఆ రైళ్లను పునరుద్ధరించండి

రైల్వే ఉన్నతాధికారికి ఎంపీ గీత వినతి



నాగ్యతో రైల్వే సమస్యలపై చర్చిస్తున్న ఎంపీ గీత

కాకినాడ: రైల్వే ట్రాక్ అభివృద్ధి పనుల నేపథ్యంలో నిలిపివేసిన రైళ్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలనిఎంపీ వంగా గీత రైల్వే ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. కాకినాడ వచ్చిన దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ నాగ్యకు ఈ మేరకు ఆమె వినతి పత్రం అందజేశారు. సింహాద్రి ఎక్స్‌ప్రెస్, విజయవాడ ఫాస్ట్ పాసింజర్లను సత్వరమే పునరుద్ధరించాలని కోరారు. గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో మహిళల కోసం ప్రత్యేకంగా జనరల్ బోగీని ఏర్పాటు చేయాలన్నారు. రెండు నెలల క్రితం నిలిపివేసిన రైళ్లలో ఇటీవలే కాకినాడ–విశాఖ ఫాస్ట్‌పాసింజర్‌ను పునరుద్ధరించారన్నారు. రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లకు పిఠాపురంలో హాల్ట్ ఇవ్వాలని కోరారు. తుని రైల్వే స్టేషన్‌లో ఎల్‌టీటీ, స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్‌లను ఆపాలని విజ్ఞప్తి చేశారు. ఇక సంబల్‌పూర్ నుంచి వారణాసి ఎక్స్‌ప్రెస్‌ను విశాఖ నుంచి నడపే రైలు కాకినాడ మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని గీత కోరారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో మృతి



నరసింహమూర్తి మృతదేహం

కొవ్వూరు: విద్యుదాఘాతానికి గురై **ధర్మవరం** గ్రామానికి చెందిన కౌలు రైతు కొణతం నరసింహమూర్తి (52) మృతి చెందారు. ఆయన అదే గ్రామానికి చెందిన రైతు వెంపాటి సత్యనారాయణ వద్ద పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. సోమవారం కొండగూడెం సమీపాన పొలంలో గట్టుపై నడచి వెళ్తున్నారు. అదే సమయంలో విద్యుత్ స్తంభంపై ఇన్సులేటర్ పగిలి, వైరు తెగి పడిందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ సంఘటనలో తీవ్ర విద్యుదాఘాతంతో నరసింహమూర్తి అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన భార్య వెంకటలక్ష్మికి పక్క పొలం రైతు ఫోన్ చేసి నరసింహమూర్తి మృతి చెందినట్టు తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై వై.శ్రీనివాసరావు తెలిపారు. మూడు నెలల క్రితమే అనారోగ్యంతో నరసింహమూర్తి కుమారుడు మృతి చెందాడు. ఇంతలోనే ఇప్పుడు ఇంటి పెద్దను కోల్పోవడంతో ఆ కుటుంబ సభ్యుల దుఃఖానికి అంతే లేకుండా పోయింది. నరసింహమూర్తికి భార్య, వివాహమైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బీడీసీలు బలోపేతం

- బడ్జెట్ పెంపుతో అందుబాటులోకి వివిధ పత్రికలు
- నిరుద్యోగ యువతకు ఎంతో ప్రయోజనం
- నిర్వాహకులు, పాఠకుల హర్షం



గ్రంథాలయంలో చదువుతున్న పాఠకులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): గ్రంథాలయాలకు అనుబంధంగా ఉన్న పుస్తక నిక్షిప్త కేంద్రాల (బీడీసీ) బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే వీటి నిర్వహణకు కేటాయింపులు పెంచింది. దీంతో బీడీసీల్లో వివిధ పత్రికలతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన పత్రికలు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఇవి తమకెంతో ఉపయోగపడుతున్నాయని పాఠకులతో పాటు ముఖ్యంగా నిరుద్యోగ యువత హర్షం వ్యక్తం చేస్తోంది.

ప్రభుత్వం తరచుగా వివిధ ఉద్యోగాల భర్తీకి ప్రకటనలు విడుదల చేస్తోంది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకునేందుకు పలువురు నిరుద్యోగులు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వారు గ్రంథాలయాల బాట పడుతున్నారు. గ్రంథాలయాలకు ఆయా మున్సిపాలిటీలు, పంచాయతీలు చెల్లించాల్సిన సెస్ బకాయిలు రూ.కోట్లలో ఉంటున్నాయి. ఈ సొమ్ములు సకాలంలో అందక గ్రంథాలయాలు, వీటికి అనుబంధంగా ఉండే బీడీసీల నిర్వహణ కష్టంగా ఉండేది.

సానుకూలంగా స్పందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గ్రేడ్–1 గ్రంథాలయాలు 2, గ్రేడ్–2 పది, గ్రేడ్–3లో 85 ఉన్నాయి. వీటికి అనుబంధంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 160 బీడీసీలు ఉన్నాయి. ఒక్కో బీడీసీకి రోజుకు సగటున 40 మంది నుంచి 100 మంది వరకూ పాఠకులు వస్తున్నారు. వీటికి అవసరమైన భవనం, ఫర్నిచర్‌ను ఆయా స్థానిక సంస్థలు సమకూర్చగా.. నిర్వహణకు ఒక వ్యక్తిని జిల్లా గ్రంథాలయ సంస్థ నియమించి, ఒక్కో కేంద్రానికి ప్రతి నెలా రూ.1,500 చొప్పున చెల్లిస్తోంది. ఇందులో రూ.వెయ్యి గౌరవ వేతనం, రూ.500 దినపత్రికలు, మ్యాగజైన్లకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. బీడీసీలను ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు తెరచి ఉంచేలా ఏర్పాటు చేశారు. ప్రారంభం నుంచీ ఏళ్ల తరబడి రూ.వెయ్యి గౌరవ వేతనంతోనే పని చేస్తున్నామని, దీనిని పెంచాలని బీడీసీల నిర్వాహకులు కోరుతున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. తమ సమస్యను వీరు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో బీడీసీ నిర్వాహకుల గౌరవ వేతనాన్ని రూ.వెయ్యి నుంచి ఏకంగా రూ.3 వేలకు, పత్రికల బడ్జెట్‌ను రూ.500 నుంచి రూ.వెయ్యికి పెంచుతూ 2019 నవంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి, వెంటనే అమలులోకి తీసుకువచ్చింది. తద్వారా దినపత్రికలతో పాటు మరిన్ని కాంపిటీషన్ సమాచార పత్రికల వంటివి అందుబాటులోకి వచ్చాయి. అలాగే చాలీచాలని గౌరవ వేతనంతో ఇబ్బందులు పడుతున్న తమకు ఎంతో ఉపశమనం లభించిందని బీడీసీల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా వీరి గౌరవ వేతనాన్ని రూ.5 వేలకు పెంచేందుకు అధికారుల నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని బీడీసీల నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్ల తరబడి పని చేస్తున్నాం



పుస్తక నిక్షిప్త కేంద్రాల్లో ఏళ్ల తరబడి పని చేస్తున్నాం. దిన పత్రికలతో పాటు మ్యాగజైన్లు, **దాతలు ఇచ్చిన** పుస్తకాలతో ఉదయం, సాయంత్రం తెరచి ఉంచుతున్నాం. వేతనం పెంచితే **మా కష్టానికి తగ్గ** ఫలితం దక్కుతుంది. – పంతం ధర్మరాజు, గెద్దనాపల్లి, కిర్లంపూడి మండలం

ముఖ్యమంత్రి వల్లే సాధ్యం



ఎప్పటి నుంచో రూ.వెయ్యి మాత్రమే ఇచ్చేవారు. కుటుంబ ఖర్చులు పెరగడంతో ఇది చాలా బాధగా అనిపించేది. ఉన్నతాధికారులను అడిగినా ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందనేవారు. ఎట్టకేలకు మా గౌరవ వేతనాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.3 వేలకు పెంచారు. పాఠకులకు అందిస్తున్న సేవలను గుర్తించి తగిన ప్రతిఫలం అందేలా చేయడం సంతోషంగా ఉంది. – బుద్రి కోకిలవాణి, విరవాడ, పిఠాపురం మండలం

సీఎంకు, మంత్రికి కృతజ్ఞతలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, విద్యా శాఖ మంత్రికి గ్రంథాలయ ఉద్యోగుల సంఘం తరఫున కృతజ్ఞతలు. ఎన్నో ఏళ్ల తరబడి పుస్తక నిక్షిప్త కేంద్ర నిర్వాహకులు చాలా తక్కువ వేతనంతో పని చేస్తున్నారు. వీరికి కనీస వేతనం పెంచడం ఆనందంగా ఉంది. దీనిని మరింతగా పెంచుతారని ఆశిస్తున్నాం.

– ములంపాక శ్రీనివాసరావు, గ్రంథాలయాధికారి, గాంధీనగర్, కాకినాడ

పురుగు మందు తాగి యువకుడి మృతి

పెరవలి: పురుగు మందు తాగిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెరవలి ఎస్సై ఎం.సూర్యభగవాన్ కథనం ప్రకారం.. ముక్కామల గ్రామానికి చెందిన మట్టా పూర్ణ సాయి వినాయక (18) ఐటీఐ చదివి, ఎలక్ట్రీషియన్‌గా పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతడికి ఏడేళ్లుగా కిడ్నీ సమస్య ఉంది. ఎన్ని మందులు వాడినా రోగం తగ్గడం లేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన వినాయక ఆదివారం పురుగు మందు తాగాడు. అతడిని తణుకులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సూర్యభగవాన్ తెలిపారు.

పాత నేరస్తుడికి కొనసాగుతున్న చికిత్స

అమలాపురం టౌన్: పట్టణ పోలీసు స్టేషన్ భవనం పైనుంచి దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన పాలకొల్లు ప్రాంతానికి చెందిన పాత నేరస్తుడు ఈతకోట రాజ్‌కుమార్‌కు చికిత్స కొనసాగుతోంది. అతడిని పోలీసులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. భవనం పైనుంచి దూకినప్పుడు ఓ మోటార్ సైకిల్‌పై పడటంతో రాజ్‌కుమార్ కాలు విరిగింది. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో అతడిని ఆస్పత్రికి తరలించారు. ఓ చోరీ కేసుకు సంబంధించి క్రైం పోలీసులు రాజ్‌కుమార్‌ను అమలాపురం తీసుకుని వచ్చి, పోలీస్ స్టేషన్ పై అంతస్తులో విచారిస్తూండగా ఈ ఘటన జరిగిందని డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ తెలిపారు. చోరీ కేసుల్లో సంబంధం ఉందన్న కారణంతోనే అతడిని విచారించారని చెప్పారు. రాజ్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని, కాలికి వైద్యం జరుగుతోందని చెప్పారు.

ప్రాణాలు తీసిన అతి వేగం

- డివైడర్‌ను ఢీకొన్న స్కూటర్
- ఇద్దరి దుర్మరణం
- మృతులిద్దరూ స్నేహితులు
- రెండు కుటుంబాల్లో విషాదం



ప్రమాదానికి కారణమైన స్కూటర్



గణేష్ (పాత చిత్రం)



శివసత్య మృతదేహం

కాకినాడ రూరల్: అతి వేగం ఇద్దరు స్నేహితులను బలిగొంది. రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. సినిమాకు వెళ్తున్నామని ఇంటి వద్ద చెప్పి, స్నేహితుడితో కలిసి బయటకు వెళ్లిన కొడుకు.. రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో ఒక కుటుంబం.. బయటకు వెళ్లిన కొడుకు ఇక తిరిగి రాడని తెలిసి మరో కుటుంబం తల్లడిల్లిపోయాయి. రెండు కుటుంబాలకు పుత్రశోకం మిగిల్చిన ఈ ప్రమాదం వివరాలివీ..

కాకినాడ నాగమల్లితోట జంక్షన్ వద్ద సూపర్ బజార్ ఎదురుగా ఆదివారం అర్ధరాత్రి డివైడర్‌ను స్కూటర్ ఢీకొనడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మృతులను కాకినాడ రూరల్ మండలం వలసపాకల బాలాజీ నగర్‌కు చెందిన కర్నాటి షణ్ముఖ గణేష్ (17), ములికి శివసత్య(17)గా గుర్తించారు. వారిద్దరూ స్కూటర్‌పై సర్పవరం జంక్షన్ నుంచి మితిమీరిన వేగంతో నాగమల్లితోట జంక్షన్ వైపు వస్తూండగా ఈ ప్రమాదం జరిగింది. స్కూటర్‌ను శివసత్య నడుపుతూండగా వెనుక షణ్ముఖ గణేష్ కూర్చున్నాడు. అతి వేగంతో డివైడర్‌ను స్కూటర్ ఢీకొనడంతో వెనుక కూర్చున్న గణేష్ తూలిపోయి రోడ్డు అవతలివైపు పడ్డాడు. వేగాన్ని నియంత్రించలేక కొద్ది దూరం వెళ్లిన తరువాత శివసత్య రోడ్డుపై పడిపోయాడు. అతడి తల వెనుక భాగం రోడ్డుకు బలంగా తగలడంతో తీవ్ర గాయంతో రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. గణేష్ కూడా తలకు గాయమవడంతో దుర్మరణం పాలయ్యాడు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు సర్పవరం పోలీసులకు, 108కు సమాచారం అందించారు. సర్పవరం సీఐ ఆకుల మురళీకృష్ణ, సిబ్బంది వెంటనే ప్రమాద స్థలానికి చేరుకున్నారు. అప్పటికే శివసత్య, గణేష్ మాట్లాడకపోవడంతో తట్టి లేపే ప్రయత్నం చేశారు. వారిద్దరినీ 108 అంబులెన్స్ సిబ్బంది పరిశీలించి, మృతి చెందినట్టు నిర్ధారించారు. దీంతో ఆ ఇద్దరి మృతదేహాలను పోలీసులు ఆటోలో జీజీహెచ్‌కు తరలించారు. ఏమాత్రం కొన ఊపిరి ఉన్నా బతికే అవకాశం ఉంటుందని వైద్యం కోసం ప్రయత్నం చేశారు. అయితే, ఆ ఇద్దరు యువకులూ మృతి చెందారని ప్రభుత్వాస్పత్రి వైద్యులు మరోసారి నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున ప్రమాద స్థలానికి, జీజీహెచ్‌కు తరలివచ్చారు.

షణ్ముఖ గణేష్ తండ్రి పెంటయ్యకు ఐదు ట్రాక్టర్లు ఉన్నాయి. వీటిని అద్దెకు ఇస్తూ జీవనం సాగిస్తున్నాడు. పదో తరగతి వరకూ చదువుకున్న గణేష్ తండ్రికి అండగా ఉంటున్నాడు. రాత్రి సినిమాకు వెళ్తున్నట్టు తండ్రి వద్ద రూ.500 తీసుకున్నాడు. అదే ప్రాంతానికి చెందిన శివసత్యను తీసుకుని బయటకు వెళ్లాడు. ఇద్దరూ సినిమాకు వెళ్లకుండా చాలాసేపు సర్పవరం జంక్షన్‌లో గడిపారు. తిరిగి ఇంటికి వెళ్లేందుకు స్కూటర్‌పై అతి వేగంగా వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. మరో మృతుడు శివసత్య తాపీమేస్త్రిగా జీవనోపాధి పొందుతున్నాడు. తొమ్మిదో తరగతి వరకూ చదువుకున్నాడు. ఇద్దరు యువకుల మృతితో బాలాజీ నగర్‌లో విషాదం అలుముకుంది. అంది వచ్చిన కొడుకులు అర్ధాంతరంగా మృతి చెందడంతో గణేష్ తల్లిదండ్రులు పెంటయ్య, సత్యవతి.. శివసత్య తల్లిదండ్రులు సత్తిబాబు, సూకరత్నం కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాలకు సోమవారం పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. సర్పవరం ఎస్సై మురళీకృష్ణ కేసు నమోదు చేశారు. సీఐ ఎ.మురళీకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలు శిక్ష

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు కేసులో ఓ వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.15 లక్షల పరిహారం విధిస్తూ కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎన్.ఉషా లక్ష్మీకుమారి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కరప మండలం గురజనాపల్లికి చెందిన పబ్బినేడి వెంకటకృష్ణ వద్ద కాకినాడ రూరల్ మండలం వాకలపూడికి చెందిన గుత్తుర్తి మురళి 2016లో రూ.13 లక్షల అప్పు తీసుకున్నాడు. ఆ బాకీ తీర్చేందుకు 2018లో రూ.15 లక్షల చెక్కు ఇచ్చాడు. అది బౌన్స్ కావడంతో వెంకటకృష్ణ కోర్టును ఆశ్రయించాడు. కోర్టు విచారణలో మురళిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

దారి దోపిడీ నిందితులకు రిమాండు

కడియం: దారి దోపిడీకి పాల్పడిన దుండగులను కడియం పోలీసులు రిమాండుకు తరలించారు. ఇన్‌స్పెక్టర్ జీవీజీ తిలక్ కథనం ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లి గ్రామానికి చెందిన నాగాబత్తుల దుర్గాప్రసాద్, అతడి స్నేహితుడు గుత్తుల హేమసాయితేజ కలిసి పరీక్ష రాసేందుకు శనివారం విశాఖపట్నం వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి రైలులో రాజమహేంద్రవరం వచ్చారు. ఆదివారం వేకువన 2 గంటల సమయంలో మోటార్ సైకిల్‌పై వానపల్లి బయలుదేరారు. వేమగిరి వద్దకు వచ్చేసరికి వారిని మరో మోటార్ సైకిల్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు అటకాయించారు. నగదు ఇవ్వకపోతే చంపేస్తామంటూ బెదిరించారు. వారి వద్ద రూ.4,500 దోచుకుని అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో బాధితుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కడియం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దుండగులు వచ్చిన మోటార్ సైకిల్ ఆధారంగా వేమగిరి గట్టు ప్రాంతానికి చెందిన బెరంపూడి మోహన్‌స్వామి, విప్పర్తి ప్రశాంత్‌కుమార్ ఈ దారి దోపిడీకి పాల్పడినట్టు నిర్ధారించుకున్నారు. నిందితులను సోమవారం ఆ గ్రామంలోనే అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద మోటార్ సైకిల్, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కోర్టులో హాజరు పరచి, రిమాండుకు తరలించారు. ఈ కేసును 24 గంటలు కూడా గడవకుండానే అత్యంత వేగంగా దర్యాప్తు చేసి, నిందితులను అరెస్టు చేసిన ఎస్సై బాలాజీ సుందరం, క్రైం సిబ్బంది సురేష్, లక్ష్మణరావులను ఉన్నతాధికారులు అభినందించారు.

కుమార్తె పుట్టింటికి రాకపోవడంతో తండ్రి ఆత్మహత్య

ఉండ్రాజవరం: పుట్టింటికి రావాలని కోరగా కుమార్తె రానని చెప్పడంతో మనస్తాపానికి గురైన ఓ తండ్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై కె.రామారావు, స్థానికులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు మండలం చింతపల్లికి చెందిన వేములమంద కాశీ విశ్వనాథరాజు (49) కుమార్తె విద్యా కవితకు, మండలంలోని వడ్లూరుకు చెందిన దండు బంగార్రాజుకు మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు ఒక కుమార్తె. ఏమైందో ఏమో కానీ కవిత ఏడాదిన్నర నుంచి పుట్టింటికి వెళ్లడం లేదు. తండ్రి విశ్వనాథరాజు పదేపదే రమ్మని పిలిచినా ఆమె పట్టించుకోవడం లేదు. కనీసం మాట్లాడటం లేదు. ఈ నేపథ్యంలో కుమార్తెను ఎలాగైనా కలవాలనే ఉద్దేశంతో విశ్వనాథరాజు ఆదివారం వడ్లూరులోని కుమార్తె కవిత ఇంటికి వచ్చాడు. ఆమె తండ్రికి సమాధానం చెప్పకపోవడంతో పాటు పుట్టింటికి రానని తెగేసి చెప్పింది. దీంతో మనస్తాపం చెందిన విశ్వనాథరాజు తనతో తెచ్చుకున్న పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరుకున్న అతడిని స్థానికులు తణుకు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విశ్వనాథరాజు మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామారావు తెలిపారు.

పట్టపగలే భారీ చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, సీఐ మురళీకృష్ణ, క్లూస్ టీమ్ సభ్యులు



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న క్రైం డీఎస్పీ రాంబాబు

- తాళం వేసి ఉన్న ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు
- రూ.10.80 లక్షలు నగదు, బంగారు ఆభరణాల అపహరణ
- కాకినాడ రూరల్ రాయుడుపాలెంలో ఘటన
- రంగంలోకి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్, క్రైం పార్టీ పోలీసులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామ పంచాయతీ పరిధి రాయుడుపాలెం కొత్తూరు జంక్షన్ సమీపాన పట్టపగలే భారీ చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీకాకుళానికి చెందిన గంటల శ్యామలరావు, రోజా దంపతులు రెండున్నరేళ్లుగా భవానీ కాలనీలోని ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఆయన హేచరీలకు, రైతులకు మధ్యవర్తిగా సీడ్ వ్యాపారం చేస్తున్నారు. శ్యామలరావు దంపతులకు ఇద్దరు కుమార్తెలు. ఒకరు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. మరొకరు అమలాపురం కిమ్స్‌లో వైద్య విద్య చదువుతున్నారు. కుమార్తె చదువు కోసం శ్రీకాకుళంలోని స్థలం అమ్మగా వచ్చిన సుమారు రూ.11 లక్షలు, సుమారు 250 గ్రాముల బంగారు ఆభరణాలను ఇంట్లో ఉంచారు. శ్యామలరావు దంపతులు సోమవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి, సామర్లకోటలోని శివాలయానికి వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం 1.30 గంటలకు వచ్చారు. ఇంటి తలుపు తాళం పగులగొట్టి ఉన్నట్టు గమనించి, ఆందోళనతో లోపలకు వెళ్లి చూడగా బీరువా తలుపు తెరచి ఉన్నట్టు గుర్తించారు. అందులోని రూ.10.80 లక్షల నగదు, బంగారు ఆభరణాలు మాయమవడంతో వెంటనే సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న సీఐ ఆకుల మురళీకృష్ణ, సిబ్బంది ఆ ఇంటికి చేరుకున్నారు. పెద్ద మొత్తంలో చోరీ జరగడంతో వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో చోరీ జరిగిన ఇంటిని కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లను తీసుకువచ్చారు. క్రైం పార్టీ పోలీసులను క్రైం డీఎస్పీ రాంబాబు రంగంలోకి దింపారు.

సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించడంతో పాటు రెండు బృందాలను ఏర్పాటు చేసి, దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ చోరీ మిస్టరీని ఛేదించేందుకు ముమ్మరంగా దర్యాప్తు చేపట్టామని క్రైం డీఎస్పీ రాంబాబు చెప్పారు. ఈ ఘటనపై సీఐ మురళీకృష్ణ కేసు నమోదు చేశారు. చోరీల్లో ఆరితేరిన వాడే ఈ దొంగతనానికి పాల్పడి ఉంటాడని సీఐ చెప్పారు. తొలుత 250 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ అయినట్టు ఫిర్యాదు చేయగా.. ఇంట్లో 60 గ్రాముల వరకూ ఆభరణాలున్నట్టు బాధితులు చెప్పారని తెలిపారు.

భవిష్యత్తు ఖగోళ శాస్త్రానిదే..



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న షార్ జీఎం విజయ్‌కుమార్

రాజానగరం: రాబోయే కాలంలో ఖగోళ భౌతిక శాస్త్రానికి పెద్దపీట వేసే అవకాశముందని శ్రీహరికోట షార్ ఇన్‌స్ట్రుమెంటేషన్ జనరల్ మేనేజర్ ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ముగింపు సందర్భంగా షిర్డీ సాయి విద్యా సంస్థల ఆధ్వర్యాన దివాన్ చెరువు ఎస్‌వీపీసీ ఫంక్షన్ హాలులో సోమవారం విద్యార్థులతో సాంకేతిక చర్చ నిర్వహించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ, ఖగోళ భౌతిక శాస్త్రం ప్రాధాన్యం, ప్రయోజనాలను వివరించారు. శాస్త్రవేత్త పి.లీలా నాగ శ్రీనివాసరావు, టెక్నికల్ అధికారి పి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, దేశంలో 47 ఇస్రో ఉప కేంద్రాలున్నాయని, వీటిల్లోని వివిధ భాగాలు వేర్వేరు కేంద్రాల్లో తయారవుతాయని చెప్పారు. వాటిని ఆయా కేంద్రాల్లో పరీక్షించిన అనంతరం, శ్రీహరికోటలో అనుసంధానించి ఉపగ్రహంగా తయారు చేస్తారని తెలిపారు.

ఆపై నిశితంగా పరీక్షించిన తరువాతే అంతరిక్షంలోకి పంపిస్తారని చెప్పారు. ఆసక్తి ఉన్న సంస్థలు ఉపగ్రహాల తయారీకి ముందుకు వస్తే, తాము వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి, ప్రోత్సహిస్తామని అన్నారు. అంతరిక్ష పరిశోధనలు, చంద్రయాన్–3 విజయంపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. తొలుత కళాశాల ఆవరణలో 150 అడుగుల విస్తీర్ణంలో ప్రధాని నరేంద్ర మోదీ, ఇస్రో చైర్మన్ సోమనాథ్, రాకెట్ నమూనాలతో కూడిన రంగుల చిత్రాన్ని విద్యార్థులు సందర్శించారు. కార్యక్రమంలో షిర్డీ సాయి విద్యా సంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

తైవాన్ వర్సిటీతో జేఎన్‌టీయూకే ఎంఓయూ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న జేఎన్‌టీయూకే వీసీ ఆచార్య ప్రసాదరాజు, తైవాన్ వర్సిటీ ప్రతినిధి నవీన్‌కుమార్‌రెడ్డి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉమ్మడి పరిశోధనలు, ఫ్యాకల్టీ, స్టూడెంట్ ఎక్స్ఛేంజి, కల్చరల్ ఎక్స్ఛేంజి ప్రోగ్రాంలు చేపట్టేందుకు తైవాన్ దేశానికి చెందిన నేషనల్ ఫార్మోసా యూనివర్సిటీకి, జేఎన్‌టీయూకేకి మధ్య ఎంఓయూ కుదిరింది. జేఎన్‌టీయూకేలోని తన చాంబర్‌లో ఉపకులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు, నేషనల్ ఫార్మోసా వర్సిటీ ప్రతినిధి నవీన్‌కుమార్ రెడ్డి ఎంఓయూపై సంతకాలు చేసి, ఒప్పంద పత్రాలను సోమవారం మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య ప్రసాదరాజు మాట్లాడుతూ, ఈ ఒప్పందంలో భాగంగా రెండు విశ్వవిద్యాలయాలూ తమ అధ్యాపకులు, విభాగాల మధ్య ప్రత్యక్ష పరిచయాన్ని, సహకారాన్ని ప్రోత్సహిస్తాయని చెప్పారు. ముఖ్యంగా ఫ్యాకల్టీ, స్టూడెంట్ ఎక్స్ఛేంజి ప్రోగ్రామ్స్, ఇంటర్న్‌షిప్స్, ఉమ్మడి పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రొఫెషనల్ టీచింగ్, కల్చరల్ ఎక్స్ఛేంజి ప్రోగ్రామ్స్, ఇంటర్ డిసిప్లినరీ పీజీ ప్రోగ్రాములు సంయుక్తంగా చేపడతామని వివరించారు. నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ ఎంఓయూతో ఇరు వర్సిటీల అధ్యాపకుల బోధనా నైపుణ్యం మరింత పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూకే రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, డీఏఏ సీహెచ్ సాయిబాబు, డీఈఈ బి.బాలకృష్ణ, ఐఐఐ పీ–టీ డైరెక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, ఎఫ్‌యూఆర్ డైరెక్టర్ ఎస్.శివనాగరాజు, డీఏపీ కె.వెంకటరెడ్డి, యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.